చిరువ్యాపారులకు కొండంత అండ

- వ్యాపారులకు బాసటగా జగనన్న తోడు పథకం
- వడ్డీ లేకుండా రూ.10 వేల రుణం
- ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం
- మండలంలో 300 మందికి లబ్ధి

మద్దికెర: చిరువ్యాపారులు, రోడ్డు పక్కన బండ్లపై వివిధ వ్యాపారాలు చేసుకునే వారు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో తోపుడు బండ్లు, కూరగాయలు, ఇతర చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి 'జగనన్న తోడు పథకం' కింద బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందిస్తూ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించి ఎదిగేందుకు అవకాశం ఇస్తోంది. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా చిరు వ్యాపారులకు ఇచ్చిన హామీని అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి చూపించడమే గాకుండా ఏటా 'జగనన్న తోడు' పథకం వర్తింప చేస్తున్నారు. చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రూ.10 వేలు రుణాన్ని అందిస్తున్నారు. లబ్ధిదారులు తీసుకున్న రుణాన్ని సక్రమంగా చెల్లిస్తే దానిపై పడే వడ్డీ భారాన్ని ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తుంది. ఈ పథకం ఏర్పాటుపై చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టానికి ప్రభుత్వం అందిస్తున్న తోడుతో తమకు ఎంతో మేలు జరుగుతుందని వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మద్దికెర మండలంలో ఆయా గ్రామాలలో దాదాపు 300 మంది వ్యాపారులు జగనన్న తోడు పథకం ద్వారా రూ.10 వేలు వడ్డీ లేని రుణాలు పొందుతున్నారు.


పండ్ల వ్యాపారం చేస్తున్న మహిళ

చిరువ్యాపారులకు వరం



జగనన్న తోడు పథకం మాలాంటి చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి వరం లాంటిది. బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణం ఇవ్వడం సంతోషదాయకం. గతంలో రోజువారీ పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులు వద్ద అప్పులు చేయాల్సి వచ్చేది. జగనన్న తోడు సొమ్ముతో వ్యాపారం వృద్ధి చేసుకుంటున్నాను. – వీరాదేవి, మద్దికెర

కష్టకాలంలో ఆదుకున్నారు



కరోనా కష్టకాలంలో వ్యాపారాలు లేక ఇబ్బందులు పడ్డాం. పెట్టుబడులు లేక అప్పులు తీసుకుంటే వడ్డీలు చెల్లించలేని పరిస్థితి. అయితే జగనన్న తోడు పథకం ద్వారా వడ్డీ లేని రుణం రూ.10 వేలు అందించడంతో అన్ని విధాలుగా సహాయపడింది. – జ్యోతి, మద్దికెర

అర్హులందరికీ జగనన్న తోడు పథకం

చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం చేసుకుంటున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న తోడు పథకం వర్తింపజేస్తున్నాం. రుణాలు తీసుకున్న వారు సకాలంలో తిరిగిచెల్లిస్తే చెల్లిస్తే మరింత మందికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తాయి. చిరు వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. – మధు, వైకేపీ ఏపీఎం, మద్దికెర

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి స్నేహితుల అండ


మిత్రుడు కుమ్మరి నాగేంద్ర భార్యకు రూ.20 వేలు సాయం అందిస్తున్న స్నేహితులు

దేవనకొండ: మండల కేంద్రానికి చెందిన కుమ్మరి నాగేంద్ర ఇటీవల కర్నూలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు 1996–97 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం దేవనకొండలోని కుమ్మరి నాగేంద్ర ఇంటికెళ్లి పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.20 వేలు అందించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థించారు. స్నేహితులు నరసన్న, వెంకటేష్, రాజశేఖర్, శేషాద్రిరెడ్డి, లక్ష్మీమూర్తి, షేక్షావలి, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

దేవనకొండ: గుడిమిరాళ్ల గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్‌ఏ) సుంకన్న అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న దేవనకొండ తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గత 40 యేళ్లుగా గ్రామంలో రైతులు, ప్రజల పట్ల సఖ్యతగా ఉంటూ. బాధ్యతగా సేవలందిస్తూ సుంకన్న మంచిపేరు పొందారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సాయం సిబ్బంది ద్వారా అందించారు. వీఆర్‌ఏ మృతికి డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, సీనియర్ సహాయకులు వెంకటేష్, వీఆర్‌ఓలు సంఘం మండలాధ్యక్షులు దాదావలి, రామాంజనేయులు, సిబ్బంది నివాళులర్పించారు.

28న హిందూ ధర్మ సమ్మేళనం

ఆలూరు: ఆలూరు గ్రామానికి రెండు కి.మీ దూరంలో ఉన్న బెళ్లగుండ ఆంజనేయస్వామి దేవాలయం, కోటవీధిలో కొలువుదీరిన భీమలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఈ నెల 28వ తేదీన హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పండితులు, పంచాగకర్త రవిశాస్త్రీ స్వామి, గవిసిద్దయ్య స్వామి ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. అదే విధంగా ఉపాధ్యానగర్ కాలనీలో సాయిబాబా మందిరంలో హిందూ ఆత్మీయ సమ్మేళనం, అనంతరం కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గోనెగండ్ల: మండలంలో ఖాళీగా ఉన్న 8 గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం చివరి రోజు అని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాలు చిన్నమరివీడులో 1, హెచ్. కైరవాడిలో 1, ఐరన్‌బండలో 1, కున్నూరులో 1, పెద్ద నేలటూర్‌లో 3, వేముగోడులో 1 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇందిరాగాంధీకి ఘననివాళి


వెల్దుర్తి గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని ఉపాధ్యాయులు మహమ్మద్ బాషా అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో మాజీ పీఎం ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో నేటికి బాలికల చదువు పట్ల వివక్ష చూపుతున్నారని, అది దేశ పురోభివృద్ధికి మంచి కాదన్నారు. అన్ని రంగాల్లో రాణించే శక్తి మహిళల్లో ఉందన్నారు. బాలికలకు విద్యాపరంగా, మహిళలకు ఉపాధి పరంగా మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరారు. గ్రంథాలయ అధికారి కవితాబాయి, ఉపాధ్యాయుడు ఖాదర్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు జి.ఎర్రగుడిలో ఎమ్మెల్యే పర్యటన


జి.ఎర్రగుడిలో నిర్మించిన సచివాలయ భవనం

తుగ్గలి: మండల పరిధిలోని జి.ఎర్రగుడిలో మంగళవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పర్యటించనున్నట్లు మాజీ సర్పంచ్ గౌరా రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్ తెలిపారు. గ్రామంలో రూ.83 లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొనాలని వారు కోరారు.

నేడు 'స్పందన'

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి ఆదివారం తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయవచ్చన్నారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరు తప్పక హాజరు కావాలన్నారు.

సామాజిక సాధికార సభ విజయవంతంపై హర్షం

పత్తికొండటౌన్: పత్తికొండలో ఈ నెల 18వ తేదీన జరిగిన సామాజిక సాధికార సభ విజయవంతం కావడంపై ఎంపీపీ ఎం.నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.శ్రీరంగడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.సోమశేఖర్, మండల కన్వీనర్ కారం నాగరాజు స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం పత్తికొండలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి వేలాది మంది ప్రజలు సభకు తరలివచ్చారన్నారు. సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేసేందుకు కృషిచేసిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయా మండలాలు, గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో పనిచేయడం వల్లనే తక్కువ వ్యవధి ఉన్నా సభ విజయవంతం అయ్యిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నెట్టేకల్లు, గుండు మహమ్మద్, కోలంట్ల నాగరాజు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై పనిభారం తగ్గించాలి


మాట్లాడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు

దేవనకొండ: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై పని ఒత్తిడి తగ్గించి వేతనం పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. మూగితాత కళ్యాణ మండపంలో ఆదివారం జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం సజావుగా సాగాలంటే ఫీల్డ్ అసిస్టెంట్లది కీలక పాత్ర అని, అలాంటి వారికి సమయానికి వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనం రూ.26 వేలకు పెంచాలన్నారు. 17 యేళ్లు దాటాక మినిమం టైమ్ స్కేల్ అమలు చేసి, రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా యూనియన్ నాయకులు హరిప్రసాద్, దేవదాసు, నాగన్న, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శేఖర్, వీరేష్, గోపాల్, ఆనంద్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం కర్నూలు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్.పెద్దరాజునాయక్ (తుగ్గలి), ప్రధాన కార్యదర్శిగా ఎల్.వీరేష్‌గౌడ్ (నందవరం), కోశాధికారిగా యం.వీరేష్ (కౌతాళం)తో పాటు మిగతా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

22 నుంచి పరదేశప్ప తాత ఆరాధనోత్సవాలు

ఆస్పరి: మండలంలోని అట్టికల్లు గ్రామంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు పరదేశప్ప తాత (అంగయ్యన్ తాత) 13వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఈ నెల 22వ తేదీన తాత సమాధికి ప్రత్యేక పూజలు, 23న పల్లకీ, నందికోలు సేవ, 24న ప్రత్యేక పూజలు, తాత చిత్రపటం ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి భజన పోటీలు

ఆస్పరి మండలంలోని అట్టికల్లు గ్రామంలో పరదేశప్ప తాత ఆరాధనోత్సవాల సందర్భంగా ఈ నెల 23వ తేదీన రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి 1 నుంచి 10వ బహుమతులు వరుసగా రూ.12,600, రూ. 9,999, రూ.8,100, రూ.7,200, రూ.6,300, రూ.5,400, రూ.4,500, రూ.3,600, రూ.2,700, రూ.1,800 నగదు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల భజన బృందాలు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసు కోవాలని కోరారు. ఉత్తమ హార్మోనిస్టు, తబలిస్టు, గాయకుడికి బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు సెల్ 91779 49327, 9676583657 నంబర్లను సంప్రదించాలన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

నందవరం: ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ, పీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు రంగప్ప, సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను విద్యార్థి సంఘాల నాయకులు పరిశీలించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్టల్‌లో దాదాపు 200 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి సరైన మెనూ పాటించకుండా నాణ్యత లేని భోజనం అందిస్తున్నారని పేర్కొన్నారు. హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం అందడం లేదన్నారు. అలాగే విద్యార్థులకు తగిన సౌకర్యాలు స్నానపు గదులు, మరుగుదొడ్లు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు వంటి వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా అధికారులు మాత్రం సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు హాస్టల్‌ను సందర్శించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళకు పాముకాటు

తుగ్గలి: మండల పరిధిలోని పి.కొత్తూరుకు చెందిన సురేఖ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఆదివారం తెల్లవారుజామున పాము కాటుకు గురైంది. గొంతు దగ్గర కట్ల పాము కాటు వేయడంతో వెంటనే కేకలు వేసింది. కుటుంబ సభ్యులు వెంటనే వచ్చి పామును గుర్తించి చంపేశారు. చికిత్స నిమిత్తం బాధితురాలిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

సీపీఐ మహిళా సంఘం ఎన్నిక

హొళగుంద: మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ మహిళా సంఘాన్ని పార్టీ మండల కార్యదర్శి పెద్యాట మారెప్ప ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా వనజమ్మ, ఉపాధ్యక్షురాలిగా వన్నూరు బీ, కార్యదర్శిగా భూలక్ష్మి, సహాయ కార్యదర్శిగా మహిదమ్మ, కోశాధికారిగా మీనాక్షి, కార్యవర్గ సభ్యులుగా ఉలిగమ్మ, బసమ్మ, ఫాతిమా, షామలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మారెప్ప మాట్లాడుతూ.. పేద, బడుగు బలహీన వర్గాలకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. రైతు సంఘం నాయకులు కృష్ణయ్య, సలాం సాబ్ వెంకన్న, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన కోగిలతోట గ్రామస్తులు

ఆలూరు: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక మంత్రి నివాసంలో ఆదివారం రాత్రి 8 గంటలకు హొళగుంద మండలం కోగిలతోట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు యాట చంద్రప్ప, చిన్నబసప్ప, తిమ్మప్ప, సుంకన్న మరో 30 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి జయరాం పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అందిస్తున్న జనరంజక పాలనను చూసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు భవిష్యత్తుకే గ్యారంటీ లేదని, బెయిల్ గడువు ముగిసిన తర్వాత ఆయన జైలుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, శేషప్ప, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన శుద్ధ జల కేంద్రం


హొళగుందలో మూతపడిన సుజల స్రవంతి వాటర్ ప్లాంట్

హొళగుంద: గ్రామ ప్రజలకు అన్ని వేళల్లో శుద్ధమైన మంచినీటిని అందిస్తున్న హొళగుంద ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ నెల రోజులుగా మూతపడింది. దీంతో గ్రామ ప్రజలకు శుద్ధ జలం అందడం లేదు. కేవలం విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో సరఫరాను నిలిపి వేయగా బిల్లును క్లియర్ చేసి మళ్లీ వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు ఎలాంటి ప్రయత్నం చేయకపోవడంపై ప్రజలు విమర్శలు చేస్తున్నారు. కళ్ల ముందు మంచి నీరు పెట్టుకుని నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా గ్రామ ప్రజలకు నీటిని అందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరుకు ఎల్లెల్సీకి నీటి సరఫరా నిలిచిపోతుండడంతో గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితులు ఎదురవుతాయని అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకుని ప్రజలకు శుద్ధమైన జలాలను అందించాలని కోరుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మిగనూరుటౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అప్పుడే మహిళా సాధికారత సాధ్యమని స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల అధ్యాపకులు హసీనా బేగం, బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఉమాదేవి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా దిశ చట్టం, మహిళా సాధికారత గురించి వివరించారు. విద్యార్థినులు చదువులతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో విజయలలిత, శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి


ఆస్పరిలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆలూరు: దేశానికి ఎనలేని సేవలందించిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని ఆలూరు లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం చిన్నారులు, మహిళలకు వివిధ ఆటల పోటీలు, పుస్తక పఠనం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలను పూలమాలలతో సన్మానించారు. అనంతరం లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం అభినందనీయమన్నారు.

ఆస్పరి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం ఆస్పరిలో లైబ్రేరియన్ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆమె సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, జంషూర్ పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు


మాళమల్లేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో కార్తీక మాసం ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన పూజారులు స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నివేదన, నీరాజన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మాత మాళమ్మ, శివాసన కట్టకు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు గిరిపైవరకు ఉన్న 401 మెట్లకు బండారం పూసి, టెంకాయ కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీతో పాటు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.

భారీ వాహనాలతో పొంచిఉన్న ముప్పు


మార్లమడికి మార్గంలో వెళుతున్న భారీ వాహనాలు

హొళగుంద: నిబంధనలు అతిక్రమించి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఎల్లెల్సీ, వేదావతి (హగరి) నదిపై నిర్మించిన బ్రిడ్జిలు దెబ్బతింటున్నాయి. ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాలకు రాకపోకలకు అనువుగా ఉన్న బ్రిడ్జిలకు భారీ వాహనాల వల్ల ముప్పు ఏర్పడుతోందని ప్రజలు వాపోతున్నారు. ఎల్లెల్సీపై 1947లో బ్రిడ్జి నిర్మించారు. బ్రిటీష్ కాలం నాటి వంతెనకు ప్రమాదం పొంచి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాహనాలు వెళ్లేటప్పుడు బ్రిడ్జ్ నుంచి వింత శబ్దాలు వినిపిస్తున్నాయి. కంకర, సిమెంట్ నల్లబండలు, ఇసుక వాహనాలు హెవీ లోడులతో తిరగడం వల్ల బ్రిడ్జిలు దెబ్బతింటున్నాయి. ఎల్లెల్సీ బ్రిడ్జిపై దాదాపు 8 టన్నులు, వేదావతి (హగరి) బ్రిడ్జ్ 15 టన్నుల బరువున్న వాహనాల సామర్థ్యాన్ని తట్టుకునేలా వంతెనలు నిర్మించారు. అయితే 30 టన్నులకు పైగా బరువున్న వాహనాలు తిరగడం వల్ల బ్రిడ్జిలు పటిష్టత కోల్పోతున్నాయి. ఇప్పటికే బ్రిడ్జిలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి దెబ్బతిన్న వంతెనలపై భారీ వాహనాల రాకపోకలు నియంత్రించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేక రైతులు నష్టపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కర్నూలులో అఖిల భారత కిసాన్ సభ జాతీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశాలకు రైతులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినేయులు, కార్యదర్శి అంజిబాబు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, వృత్తిదారుల జిల్లా సంఘ జిల్లా కన్వీనర్ గురుశేఖర్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతమార్కెట్ స్థలంపై కన్ను


రామకొండలో ఆక్రమణకు వీలుగా చదును చేస్తున్న సంత మార్కెట్ స్థలం

తుగ్గలి: ఎప్పుడో పెద్దల కాలంలో ప్రజల అవసరాల కోసం ఇచ్చిన స్థలం ఇప్పుడు అన్యాక్రాంతమవుతోంది. మండల పరిధిలోని రామకొండ పంచాయతీ మజరా గ్రామం పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో 501–సి2 సర్వే నంబర్‌లో ఎకరం స్థలాన్ని ఏళ్ల క్రితం సంత మార్కెట్ నిర్వహించుకునేందుకు రామకొండకు చెందిన ఓ దాత ఇచ్చారు. భూ రికార్డుల్లో సైతం ఆ సర్వే నంబర్‌కు సంబంధించి సంత మార్కెట్ స్థలం అని నమోదై ఉంది. అయితే కొన్నేళ్లుగా సంత నిర్వహించడం లేదు. గ్రామంలో ఐదారేళ్లుగా స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడటంతో స్థలాల రేట్లు భారీగా పెరిగాయి. పేరుకు జంక్షన్ అయినా పెండేకల్లు రైల్వే జంక్షన్ ఒక మారుమూల గ్రామమే. అయితే పట్టణాల్లో కంటే ఇక్కడ స్థలాల రేట్లు అధికంగా ఉన్నాయంటే ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతోంది. సెంటు స్థలం దాదాపు రూ.4 లక్షలకు పైగా ధర పలుకుతోంది. దీంతో సంత మార్కెట్ స్థలంపై కొందరి కన్నుపడింది. ఇప్పటికే ఆక్రమణదారులు కొంత అన్యాక్రాంతం చేయగా మిగిలిన స్థలం కూడా కబ్జా చేసేందుకు చెట్లు, ముళ్ల కంపలు తొలగించే పనిలో పడ్డారు. విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సంత మార్కెట్ స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అంకాలప్పను వివరణ కోరగా సంత మార్కెట్ స్థలం అన్యాక్రాంతం విషయం తమ దృష్టికి వచ్చిందని, పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

- నది తీర ప్రాంతాల్లో జోరుగా వరికోతలు
- కోత కోస్తున్న వరికోత యంత్రాలు
- మద్దతు ధరపై ఆనందంలో రైతన్నలు


పెద్దకొత్తిలిలో యంత్రంతో వరి కోతలు చేపడుతున్న దృశ్యం

నందవరం: ఆరుగాలం శ్రమించిన రైతన్నకు పంట పండింది. మంచి దిగుబడులు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. నది తీర ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ఆరంభంలో అధికంగా వర్షాలు కురవడంతో రైతులు వరి సాగుపై మొగ్గు చూపారు. ప్రస్తుతం నది తీర ప్రాంతాల్లో వరి కోతలు ఊపందుకున్నాయి. యంత్రాల సవ్వడి.. కూలీల సందడితో నది తీర ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. మండలంలో 2,244 ఎకరాల్లో వరి సాగైందని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. రైతులు బీపీటీ 5204, ఎన్‌డీఎల్ఆర్, ఆర్ఎన్ఆర్ వరి రకాలు ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం మండలంలోని నది తీర ప్రాంతాలైన నదికై రవాడి, నాగలదిన్నె, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గురజాల గ్రామాలలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. కూలీల భారంతో రైతులు యంత్రాల ద్వారా వరి కోతలను ప్రారంభించారు. ప్రభుత్వం వరికి మద్దతు ధర రూ.2,200తో పాటు బయట మార్కెట్లో వరి ధాన్యానికి రూ.2,500 నుంచి రూ.3,000 వరకు ధర పలుకుతోంది. వరికి గిట్టుబాటు ధర లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి కోతలు పూర్తయిన రైతులు ధాన్యాలను కల్లాల్లో ఆరబోసుకుని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో పాటుగా గడ్డికి కూడా డిమాండ్ పెరగడంతో ఎకరం వరి గడ్డి రూ.10 వేలు పలుకుతోంది. ఈ సారి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, వరి ధాన్యానికి మంచి ధర లభిస్తుడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ ధరకు అమ్ముకోవద్దు



వరి ధాన్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రైతులు తొందరపడి తక్కువ ధరకు అమ్ముకోవద్దు. ప్రభుత్వం కూడా వరికి గిట్టుబాటు ధరను కల్పించింది. మార్కెట్లో వరికి రూ.2,500 నుంచి రూ. 3 వేల వరకు ధర లభిస్తుంది. ధాన్యానికి డిమాండ్ పెరగడంతో ధరలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యానికి రూ.2,203 గిట్టుబాటు ధర కల్పించింది.
– ఏఓ మర్రి స్రవంతి, నందవరం